క్లుప్తంగా

విద్యార్థుల భవిష్యత్‌లో తల్లిదండ్రులు కీలకం

కమిషనర్ శివన్నారాయణ



గురజాల: విద్యార్థుల భవిష్యత్‌లో తల్లిదండ్రుల బాధ్యత ఎంతో కీలకమని నగర పంచాయతీ కమిషనర్ వైవీఎల్ శివన్నారాయణ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం 2024–25 సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో మంచి ప్రతిభ కనబరచిన విద్యార్థులకు స్నేహా యూత్ ఆధ్వర్యంలో కోలా మెరిట్ అవార్డులను అందించారు. ఈ సందర్భంగా ఎస్.శృతిలయ, కె.తులసీ నాగలక్ష్మిలను సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఆకుల సత్యనారాయణ, స్నేహా యూత్ అధ్యక్షుడు కోలా కోటేశ్వరరావు, వార్డు కౌన్సిలర్ బండి రవికుమార్, పాండు, సుబ్బు, బీఎస్ఆర్ పాల్గొన్నారు.

సీనియర్ జర్నలిస్ట్ రమేష్ మృతి



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణ సీనియర్ జర్నలిస్ట్ కొత్తపల్లి రమేష్ (51) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఆయన ఏపీయూడబ్ల్యూజే ఆర్గనైజింగ్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా, ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రానిక్ మీడియా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా పని చేస్తున్నారు. ఏపీడబ్ల్యూజే రాష్ట్ర, జిల్లా, పిడుగురాళ్ల శాఖ నాయకులు హాజరై ఆయన భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర వైద్యుల విభాగం అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్, టీటీడీ సభ్యులు జంగా కృష్ణమూర్తితో పాటు పలువురు నాయకులు హాజరై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

షిరిడి సాయిబాబాకు ప్రత్యేక పూజలు



పాలువాయి జంక్షన్(రెంటచింతల): స్థానిక షిరిడి సాయి ఆలయంలో గురువారం ఆలయ అర్చకులు గోపాల్ పాండే ఆధ్వర్యంలో భక్తులు షిరిడి సాయిబాబాకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, పలు రకాల అభిషేకాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఎంతో మహిమ కలిగిన షిరిడి సాయిబాబాని పూజిస్తే తాము కోరిన కోరికలు నెరవేరుతాయనే భావంతో పల్నాడు జిల్లాలోని అనేక గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఈ ఆలయానికి చేరుకుని సాయినాధునికి ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఆవరణలో భజనాబృందం బాబా గీతాలను ఆలపించగా భక్తులు తన్మయం చెందారు. దేవస్థానం చైర్మన్ భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విత్తన దుకాణాల తనిఖీ



మాచర్ల: పట్టణంలోని విత్తనాలు, ఎరువు దుకాణాలను వ్యవసాయ శాఖ అధికారులు గురువారం తనిఖీ చేశారు. తనిఖీల్లో సహాయ సంక్షేమ అధికారి జగదీష్‌రెడ్డి పలు షాపుల్లో సోదాలు చేశారు. విత్తనాల నిల్వ, ఎరువుల స్టాక్‌లను పరిశీలించారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో బిల్లు తీసుకోవాలని సూచించారు. రైతులకు నష్టపరిచే విత్తనాలు విక్రయించరాదని హెచ్చరించారు. పత్తి ఫ్యాక్టరీ, కోదండరామయ్య తదితర ప్రాంతాల్లోని షాపులను తనిఖీలు జరిపారు. ఆయన వెంట మాచర్ల వ్యవసాయ అధికారి పాపమ్మ ఉన్నారు.

పిడుగురాళ్ల: పట్టణ, మండలంలోని గుంటూరు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ ఎరువులు, పీఏసీఎస్ గోదాములను మండల వ్యవసాయశాఖ అధికారి ఎం.సంధ్యారాణి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఎరువులు కావాల్సిన రైతులు సొసైటీలలో కానీ పట్టణంలోని ప్రైవేటు ఎరువుల దుకాణాల నుంచి ఎరువులను పొందవచ్చునన్నారు.

పొలం గట్ల వివాదంపై కేసు నమోదు

ముప్పాళ్ళ: పొలం గట్ల వివాదంపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వి.సోమేశ్వరరావు గురువారం తెలిపారు. నరసరావుపేట మండలంలోని ములకలూరుకు చెందిన చింతా ఆంజనేయులు, అతని సోదరి చెన్నంశెట్టి చంద్రికలకు ముప్పాళ్ళ మండలంలోని గోళ్ళపాడు గ్రామ రెవెన్యూ పరిధిలో కొంత వ్యవసాయ భూమి కలదు. గత కొంతకాలం నుంచి ఆంజనేయులు, అతని భార్య సునీత తనకు కట్నంగా ఇచ్చిన పొలం హద్దు రాళ్లను తరచూ పీకివేస్తూ ఇబ్బందులు పెడుతున్నారంటూ ఆంజనేయులు సోదరి చెన్నంశెట్టి చంద్రిక ముప్పాళ్ళ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. చంద్రిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.





● వైభవంగా చౌడేశ్వరీ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం

రెంటచింతల: స్థానిక జగన్మాత చౌడేశ్వరీ అమ్మవారి దేవస్థానం వార్షికోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. చౌడేశ్వరి అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవస్థానం ప్రధాన అర్చకులు పి.అనీల్‌కుమార్ శర్మ నేతృత్వంలో వేదపండితులు పూరిమెట్ల శేషభాట్టాచార్యులు భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేడుకలలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులై తీర్థప్రసాదాలను స్వీకరించారు. పెద్దశెట్టి పల్లా వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు రెండు వేల మంది భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి



పత్తి రైతులకు సూచనలు ఇస్తున్న ఏఓ లక్ష్మారెడ్డి

రెంటచింతల: కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాల నుంచి ముదురు పత్తి వేసిన రైతులు పంటను కాపాడుకునేందుకు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి కట్టా లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గ్రామాలలో రెంటచింతల, రెంటాల గ్రామాలలో ముదురు పత్తి పంట పొలాలను ఆయన సందర్శించి రైతులకు వర్షం కురిసిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పొలంలో పల్లం ప్రాంతంలో వర్షంనీరు నిలిచిన వెంటనే వెళ్లపెట్టాలన్నారు. ఎకరాకు 15 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్‌ను వెద పెట్టాలని లేద చల్లాలన్నారు. కాయకుళ్లు, కొమ్మకుళ్లు, ఆకు మచ్చ వంటి తెగుళ్ల నివారణకు లీటర్‌కు నీటిలో కాపర్ ఆక్సిడ్ క్లోరైడ్ మందును 2 గ్రాముల చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. రైతులందరూ సాగు చేసిన, సాగు చేస్తున్న పంటలకు రైతు సేవాకేంద్రంలో పంట బీమా చేయించుకోవాలని కోరారు. పత్తి, మిరప, కంది పంటలను జూలై 31 వ తేదీ లోపు, వరిపంటకు ఆగస్టు 15 వరకు పంటల బీమా చేయించుకోవడానికి గడువు ఉందన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన బిల్లులను రైతులు తమ వద్ద కచ్చితంగా పంటల కాలం ముగిసే వరకు భద్రపరుచుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు రాంబాబు, రైతులు పాల్గొన్నారు.

గుర్రం జాషువాను యువత ఆదర్శంగా తీసుకోవాలి



పిడుగురాళ్ల పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గుర్రం జాషువా చిత్రపటం వద్ద నివాళి

పిడుగురాళ్ల: నవయుత కవి చక్రవర్తి, పద్మభూషణ్ గుర్రం జాషువా వర్ధంతిని పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. పార్టీ పట్టణ యూత్ అధ్యక్షులు మందా సుధీర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గుర్రం జాషువా, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ మాదాల కిరణ్‌కుమార్, జిల్లా యూత్ వైస్ ప్రెసిడెంట్ సయ్యద్ జబీర్, బీసీ సెల్ పట్టణ అధ్యక్షులు కందులూరి శివయ్య, మాచవరం జెడ్పీటీసీ సభ్యుడు జువ్వెనబోయిన శివాయాదవ్, కౌన్సిలర్లు గుర్రం అప్పిరెడ్డి, షేక్ అబ్దుల్లా, మాజీ ఎంపీపీ గండికోట కోటేశ్వరరావు, షేక్ జానిబాబు, నాయకులు దేగల యోహాన్, జక్కుల అప్పారావు, శ్రీనివాసరెడ్డి, దేవళ్ల నాగరాజు, జానకిరామయ్య, రత్నబాబు, అందుగుల చరణ్, నెకరికంటి రవితేజ, ముద్దా సుధాకర్, వెంకట్రావు, గోపియాదవ్, సాయి కుమార్, మోజెష్, మీసాల రాజు పాల్గొన్నారు.

జాషువా ఆశయాలను సాధిద్దాం

దాచేపల్లి: సమాజంలో అసమానతలు, అంటరానితనంపై కవిత్వం ద్వారా రాజీలేని పోరాటం చేసిన మహనీయుడు గుర్రం జాషువా అని, జాషువా ఆశయా సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎంపీపీ కందుల జాను అన్నారు. గుర్రం జాషువా వర్ధంతిని వైస్సార్‌సీపీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. నారాయణపురంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జాషువా చిత్రపటానికి పూలదండలు వేసి నాయకులు నివాళులర్పించారు. బంగ్లా సెంటర్‌లో జాషువా విగ్రహానికి పూలదండలు వేసి ఆయన చేసిన సేవలను నేతలు కొనియాడారు. అణచివేతకు గురవుతున్న బడుగులను చైతన్యపరిచేందుకు జాషువా కలం నుంచి వచ్చిన కవితలు ఎంతగానో ఉపయోగపడ్డాయని చెప్పారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, మాజీ సర్పంచి మందపాటి రమేష్ రెడ్డి, పార్టీ మండల పట్టణ కన్వీనర్లు కోట కృష్ణ, షేక్ సుభాని, వైస్ ఎంపీపీ తండా అబ్దుల్ సత్తార్, వైస్ చైర్మన్ కొమరబత్తిన విజయకుమార్, నాయకులు ఎం.వెంకటేశ్వర్లు, దేవళ్ల రఘు, కె. తిరుపతి రెడ్డి, డి.సైదారావు, ఎస్.గురువులు, జె.సింగరయ్య యాదవ్, ఎం.శ్రీనివాసరావు, జి.పుల్లారావు, బి.మరియదాసు, ఎం.కొండలు, షేక్ డాడీ, మోమిన్ నాగుల్ మీర, షేక్ సైదావలి, జి.సైదారావు, పాప, ఎం. శ్రీనివాసరావు, జయదేవ్ పాల్గొన్నారు.

గుర్రం జాషువాకు ఘన నివాళి



గుర్రం జాషువా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కార్డ్స్ సంస్థ డెప్యూటీ డైరెక్టర్ అమర్‌నాథ్



దాచేపల్లిలో జాషువా వర్ధంతి కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

పిడుగురాళ్ల: నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా వర్ధంతిని పట్టణంలోని లెనిన్ నగర్‌లో ఉన్న కార్డ్స్ స్కూల్‌లో గురువారం నిర్వహించారు. సమాజంలో అసమానతలు పోవాలని, తన కలాన్ని ఖడ్గంగా చేసుకొనిపోరాటం చేసిన కవి గుర్రం జాషువా అని కార్డ్స్ సంస్థ డెప్యూటీ డైరెక్టర్ తాళ్లూరి అమరనాథ్ అన్నారు. తొలుత గుర్రం జాషువా చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్డ్స్ స్కూల్ హెచ్‌ఎం లత మాట్లాడారు. కార్యక్రమానికి దయామని అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో దళిత సేవాదళ్ తళ్లూరి సురేష్ చంద్ పాల్గొన్నారు.


ఔషధ మొక్కలను కాపాడుకోవాలి

ప్రభుత్వ సలహాదారు అంకారావు

కారెంపూడి: అడవుల్లో అంతరించిపోతున్న ఎంతో విలువైన ఔషధ మొక్కలను కాపాడుకోవాల్సిన అవసరం, భావి తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని వనాల వృద్ధి అడవుల పెంపకం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కొమెర అంకారావు(జాజి) అన్నారు. మడ అడవుల దినోత్సవం సందర్భంగా గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వనాల వృద్ధిని అందరూ సామాజిక బాధ్యతగా స్వీకరించాలని కోరారు. వేసవిలో అందరించిపోతున్న మొక్కల విత్తనాలను సేకరించి వాటిని విత్తన బంతులుగా తయారు చేసి వర్షాకాలంలో అటవీ ప్రాంతంలో చల్లడం ద్వారా అడవుల వృద్ధిలో అందరూ భాగస్వాములు అవుతారని చెప్పారు. అడవిలో సరైన ఆహారం లభ్యం కాక కోతులు మరి కొన్ని వన్యప్రాణులు గ్రామాల్లోకి వచ్చి పెద్ద సమస్యగా మారాయని దీనికి పరిష్కారంగా అడవుల్లో అంతిరించిపోతున్న వాటికి ఆహారాన్ని అందించే ఫల వృక్షాలను కూడా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు. అలాగే మడ అడవులను సంరక్షించుకోవడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. అడవుల వృద్ధి ద్వారానే జల వనరుల సంరక్షణ కూడా జరుగుతుందన్నారు. ప్రాణికోటికి ముఖ్యంగా మానవాళి మనుగడకు అభివృద్ధికి ఇవే మూలం ప్రాణాధారమని గుర్తెరిగి ప్రతి ఒక్కరూ వనాల వృద్ధిలో పాలుపంచుకోవాలని కోరారు. ఈ సందర్భంగా జాజి కొన్ని ప్రాంతాలలో గురువారం విత్తన బంతులను చల్లారు.

వినుకొండ ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం

- ప్రయాణికులకు సమాచారం లేకుండా సర్వీసు రద్దు
- విశాఖపట్నంకు రిజర్వేషన్ చేయించుకుని బస్టాండ్‌లో ప్రయాణికుల ఎదురుచూపులు
- బస్సు రద్దు అయిందని తెలుసుకుని నిరాశగా వెనుదిరిగిన ప్రయాణికులు



రద్దు అయిన విశాఖ బస్సు ఇదే

వినుకొండ: ఆర్టీసీ డిపో అధికారుల నిర్లక్ష్యంతో విశాఖ పట్టణం వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వినుకొండ డిపో నుంచి విశాఖ పట్నంకు ప్రతి రోజూ సాయంత్రం 6 గంటలకు బస్సు బయలుదేరుతుంది. అయితే గురువారం సాయంత్రం 6 గంటలకు బస్సు బయలుదేరవలసి ఉంది. విశాఖపట్నం వెళ్లవలసిన ప్రయాణికులు కొందరు ముందుగా రిజర్వేషన్ చేయించుకుని, బస్టాండ్‌కు చేరుకున్నారు. 6 గంటలైన బస్సు ప్లాట్ ఫామ్ మీదకు రాకపోవడంతో, బస్సు రాలేదని ప్రయాణికులు సిబ్బంది ని విచారించగా బస్సు క్యాన్సిల్ అయ్యిందని తెలిపారు. దీంతో ప్రయాణికులు తాము ఎలా ప్రయాణించాలి, బస్సు సర్వీసు రద్దు చేసిన విషయం సమాచారం తెలపరా అని ప్రశ్నించగా 7 గంటలకు ఇతర డిపో బస్సు ఉందని అందులో వెళ్లాలని సలహా ఇచ్చి, ప్రయాణికుల రిజర్వేషన్ టిక్కెట్లు రద్దు చేశారు. దీంతో చేసేది ఏమి లేక కొందరు ప్రయాణం విరమించుకోగా, మరికొందరు ఇతర పట్టణాలకు వెళ్లి అక్కడి నుంచి విశాఖపట్నం బయలుదేరి వెళ్లారు. ఈ సంఘటన పై డిపో మేనేజర్ నాగేశ్వరరావు ను వివరణ కోరగా తాను విధి నిర్వహణలో భాగంగా విజయవాడ మీటింగ్ కు వెళ్లినట్లు, బస్సు క్యాన్సిల్ విషయం తన దృష్టికి రాలేదని... భవిష్యత్తులో ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకుంటామని తెలిపారు.

పల్నాడులో జడివాన



గురజాలలో వర్షం దృశ్యం



మాచర్ల పట్టణంలో రోడ్లు జలమయం

గురజాల/మాచర్ల: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా గురువారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి వాతావరణం చల్లబడింది. వర్షం పంటలకు ప్రాణం పోసింది. దీంతో వరి, పత్తి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పంట పొలాల్లో వర్షం నీరు నిలిచింది. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి.

శ్రద్ధగా వింటే ఏ సబ్జెక్టు కష్టం కాదు

సీడ్స్ సంస్థ ఆధ్వర్యంలో రూ.25 వేల విలువైన సైన్స్, మ్యాథ్స్ కిట్స్



యడ్లపాడు: బోధన సమయంలో విద్యార్థులు శ్రద్ధతో వినగలిగినప్పుడు ఏ సబ్జెక్టు అయినా సులభంగా అవగతం చేసుకోవచ్చని హెచ్‌ఎం షేక్ నజీర్ తెలిపారు. లింగారావుపాలెం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం సైన్స్ అండ్ మ్యాథ్ కిట్స్ అందజేశారు. విద్యార్థులకు విజ్ఞానశాస్త్రం, గణితం పట్ల ఆసక్తిని పెంపొందించడానికి, ప్రయోగాత్మకంగా నేర్చుకోవడానికి ఈ కిట్లు ఎంతగానో ఉపయోగపడతాయని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. 'సీడ్స్' స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సుమారు రూ. 25 వేల విలువ కలిగిన ఈ కిట్‌లను విద్యార్థులకు అందించడం పట్ల ఉపాధ్యాయులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నంబూరి నరసింహారావు, తోకల సత్యనారాయణ, సీడ్స్ సంస్థ సభ్యులు షేక్ రసూల్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు, అంతర్గత డ్రైనేజీలకు శంకుస్థాపన

సత్తెనపల్లి: పట్టణంలో రూ.12.03 లక్షలతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్లు, అంతర్గత డ్రైనేజీలకు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శంకుస్థాపన చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా గురువారం పట్టణంలోని 3వ వార్డులో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. రూ.16.40 లక్షలతో ఆధునికీకరణ చేసిన వాకింగ్ ట్రాక్‌ను ప్రారంభించారు.

బస్టాండు ముఖం చూడని బస్సులు

ఒక్క బస్సు లోపలకు వచ్చి వెళితే ఒట్టు!



యడ్లపాడులో నిరుపయోగంగా ఆర్టీసీ బస్టాండ్

- యడ్లపాడులో పేరుకే బస్టాండ్
- అలంకార ప్రాయంగా ప్రాంగణం
- రూ.లక్షల నిధులు దుర్వినియోగం
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

యడ్లపాడు: మండల కేంద్రంగా ఉన్న యడ్లపాడులో ఆర్టీసీ బస్టాండ్ ఉన్నా, అటు ప్రజలకు ఇటు ఆర్టీసీకు ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. ఒక్క బస్సు అక్కడికి రాదు. అలాగని ఒక్క ప్రయాణికుడు అక్కడికి వచ్చేందుకు ఆసక్తి చూపరు. దీంతో లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన బస్టాండ్ పాడుబడిపోయి నిరుపయోగంగా మిగిలిపోతోంది. నిత్యం యడ్లపాడు గ్రామం మీదుగా వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు జరుగుతున్న మండల ప్రజలకు పల్లె వెలుగు సర్వీసులు తప్ప ఇతర సర్వీసులు అందుబాటులో రావడం లేదు.

బస్టాండ్ ఉన్నా.. ప్రయోజనం సున్నా...

బస్టాండ్ ఉన్నా ప్రజలు మాత్రం అక్కడి రాకపోవడంతో డిపో అధికారులు అక్కడికి బస్సుల్ని నిలుపుదల చేయడం మానేశారు. దీంతో యడ్లపాడు గ్రామంలోని రెండు అండర్‌పాస్ వంతెనలకు ఇరువైపులా నాలుగు ప్రదేశాల్లో బస్సుల్ని నిలుపుదల చేస్తున్నారు. ఎండైనా, వానైనా రాత్రి అయినా గంటల కొద్ది ప్రజలు అక్కడే నిలువు కాళ్లపై ఉంటూ బస్సుల కోసం వేచి చూస్తుండటం గమనార్హం. సర్వీసు మార్గంలో బస్సుల్ని ఆపడంతో ట్రాఫిక్ సమస్యతో పాటు వాటి వెనుక వచ్చే వాహనాలకు ఇబ్బందిగా మారుతుంది. దశాబ్దాల కాలం నుంచి మండల ప్రజలను వెంటాడుతున్న ఈ సమస్య పరిష్కారానికి అటు ప్రజాప్రతినిధులు, ఇటు ఆర్టీసీ అధికారులు చొరవ తీసుకోవడం లేదు.

నాలుగుచోట్ల బస్‌స్టాపులు... ఎక్కడా సెల్టర్లు లేవు...

సొలస, లింగారావుపాలెం, మైదవోలు, జాలాది, జగ్గాపురం, గుత్తావారిపాలెం, కారుచోల గ్రామాలకు చెందిన ప్రజలు బస్సుల కోసం ఎక్కువగా యడ్లపాడుకు రావడం జరుగుతుంది. మొదట దింతెనపాడు, తిమ్మాపురం వాసులు తిమ్మాపురం జంక్షన్ లోనూ, ఉప్పరపాలెం, వంకాయలపాడు వాసులు వంకాయలపాడు వంతెన వద్ద, కొత్తపాలెం, కొండవీడు, కోట, సంతపేట, చెంఘీజ్ ఖాన్‌పేట, సంగం గోపాలపురం, బున్నీనగర్, ఉన్నవ వాసులు బోయపాలెం అండర్‌పాస్ వద్ద బస్సుల్ని ఎక్కేస్తుంటారు. అయితే ఈ నాలుగు గ్రామాల్లోని బస్‌స్టాపుల్లో ఎక్కడా ఎక్కడా ప్రయాణికులు కూర్చోనేందుకు బస్ సెల్టర్లు అందుబాటులో లేవు. యడ్లపాడులో ఒకటి ఉన్నా అది బస్సులు నిలిపేచోటకు దూరంగా ఉన్నందున యాచకులకు ఆవాసంగా మారింది. రోడ్లపై బస్సుల కోసం వేచి ఉండే సమయంలో వృద్ధులు, పిల్లలు ప్రమాదాల బారినపడే అవకాశం ఉంది. ఇప్పటికైనా లక్షలు వెచ్చించిన యడ్లపాడు ఆర్టీసీ బస్టాండ్‌ను ప్రయాణికుల ఉపయోగంలోకి తేవాలి. లేకుంటే ఆర్టీసీ ఆదా యానికి తోడ్పడేలా అద్దెకు ఇవ్వాలని ప్రజలు సూచిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు సమన్వయంతో దశాబ్దాలుగా నెలకొన్న బస్టాండ్, బస్‌సెల్టర్ల సమస్యలకు చెక్ పెట్టాలని కోరుతున్నారు.

బాల్యవివాహాలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

బెల్లంకొండ: బాల్య వివాహాల పట్ల విద్యార్థులు చిన్నతనం నుంచే అవగాహన కలిగి ఉండాలని చంద్రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని చంద్రాజుపాలెంలోని జెడ్పీ హైస్కూల్లో బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు ఆడపిల్లలకు 18, మగ పిల్లలకు 21 సంవత్సరాలు నిండకుండా వివాహం చేయకూడదన్నారు. తక్కువ వయసులో వివాహం చేయడం వలన ఆడపిల్లలలో శారీరక, మానసిక ఎదుగుదల లోపించి ఎన్నో ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. చిన్న వయసులో గర్భం దాల్చడం వల్ల పుట్టే పిల్లలకు శారీరక వైకల్యం, ఎదుగుదల లేకపోవడం వంటి సమస్యలు వస్తాయన్నారు. స్థానిక ఎస్ఐ డి.ప్రవీణ్ మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో విద్యార్థులు చెడు వ్యసనాలకు అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. మత్తు పదార్థాలు, డ్రగ్స్ వలన కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పీఎండీఎస్ సాగులో పంట కోత ప్రయోగం



చల్లగుండ్లలో వ్యవసాయ శిక్షకుడు సైదయ్య

నకరికల్లు: పీఎండీఎస్ పద్ధతిలో 30 రకాల విత్తనాలను పంట వేసే ముందుగా సాగు చేయడం ద్వారా ప్రధాన పంటలో పెట్టుబడి ఖర్చును తగ్గించుకోవచ్చని పల్నాడు జిల్లా ప్రకృతి వ్యవసాయ శిక్షకుడు సైదయ్య తెలిపారు. మండలంలోని చల్లగుండ్ల గ్రామంలో పీఎండీఎస్ విత్తనాలను సాగు చేస్తున్న పొలాలను గురువారం పరిశీలించి పంటకోత ప్రయోగం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహారధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజలు, సుగంధద్రవ్యాలు, పచ్చిరొట్ట విత్తనాలు, ఆకుకూరలు, కూరగాయలు, తీగ, దుంపజాతి తదితర 30 రకాల విత్తనాలను ప్రధాన పంటకు ముందుగా సాగు చేయాలన్నారు. తద్వారా దిబ్బ ఎరువుల కోసం పెట్టే పెట్టుబడి, రసాయనిక ఎరువుల వాడకం తగ్గించుకోవచ్చని తెలిపారు. చీడపీడలు తట్టుకునే శక్తి పంటలకు పెరుగుతుందన్నారు. పీఎండీఎస్ సాగు చేసిన పొలంలో 5 మీటర్ల వైశాల్యంతో పంటకోత ప్రయోగం చేయగా 77.800 కిలోల దిగుబడి వచ్చిందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అప్పల రాజు, నందకుమార్ పాల్గొన్నారు.

ఆరో తరగతి విద్యార్థుల సామర్థ్యాల పరిశీలన



నాదెండ్ల: చిరుమామిళ్ళ శ్రీ నడికట్టురామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం డైట్ రిసోర్స్ పర్సన్స్ బాలకోటయ్య, విమలాకుమారి సందర్శించారు. ఆరో తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. తెలుగు, ఇంగ్లీష్ సబ్జెక్టుల్లో 40 శాతం మంది విద్యార్థులు వెనుకబడి ఉన్నారని, వీరు కనీసం అక్షరాలు గుర్తించలేని స్థితిలో ఉన్నారని గమనించారు. క్రిందిస్థాయి నుండే విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలని, లేనిచో వారు పదో తరగతిలో ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని ఉపాధ్యాయులకు వివరించారు. జిల్లాలోనే ఈ పాఠశాలకు పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మంచి పేరు ఉందని, ఈ పేరు నిలుపుకునేలా ఉపాధ్యాయులు శ్రద్ధతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.